సాక్షి
జగిత్యాల
శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023

సెల్ఫీ విత్ గణేశ్


గణేశ్‌నగర్ రెసిడెన్సీలో గణనాథుడితో అనిత



తన మిత్రులతో హరీశ్


మార్కండేయ ఆలయంలో హనుమల్ల శ్రీనివాస్‌రెడ్డి


తన షాపులో రాచకొండ నాగరాజు

'సాక్షి సెల్ఫీ విత్ గణేశ్'కు ప్రజలు స్పందించారు. జిల్లాకేంద్రంలోని మార్కండేయ ఆలయంలోని మట్టి గణపతితో పట్టణానికి చెందిన హనుమల్ల శ్రీనివాస్‌రెడ్డి, తన ఎలక్ట్రానిక్స్ షాపులో రాచకొండ నాగరాజు, హరీశ్ అతడి మిత్రులు, గణేశ్‌నగర్ రెసిడెన్సీలో అయిత అనిత సెల్ఫీ పంపారు. మీరూ సెల్ఫీ దిగి 95426 16103 కు వాట్సాప్ చేయండి. – జగిత్యాలటౌన్

న్యూస్‌రీల్

రైతులకు రుణమాఫీ అయ్యేలా చూడండి

కలెక్టర్ యాస్మిన్ బాషా



యాస్మిన్ బాషా

జగిత్యాల: రైతులకు రుణమాఫీ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో పంట రుణాలు, రైతు రుణమాఫీకి సంబంధించిన అంశాలపై సంబంధిత అధికారులతో గురువారం సమీక్షించారు. రుణమాఫీ అయిన రైతులకు కొత్తగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. రుణమాఫీకి సంబంధించి సాంకేతిక సమస్యల కారణంగా లబ్ధిపొందని రైతుల్లో ఇతర బ్యాంకుల ఖాతా వివరాలు లభించని జాబితా పంపించామని, క్షేత్రస్థాయిలో విచారణ పూర్తి చేసి వారికీ రుణమాఫీ అందేలా చూడాలని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వెరిఫికేషన్ మాత్రమే చేస్తారని తెలిపారు. సమావేశంలో వ్యవసాయాధికారి సురేశ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు చేసుకోవాలి


అదనపు కలెక్టర్

జగిత్యాల: ప్రతి ఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. ఆధార్ మానిటరింగ్ కమిటీతో గురువారం సమావేశమయ్యారు. ఆధార్ తీసుకుని పదేళ్లు దాటినవారు, 5 నుంచి పదేళ్ల పిల్లలు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు రాజేశ్వర్, మధు, వెంకట్‌రెడ్డి, రవీందర్, డీఎంహెచ్‌వో శ్రీధర్, డీఆర్డీవో నరేశ్, డీఈవో జగన్మోహన్‌రెడ్డి, డీసీఎస్‌వో వెంకటేశ్ పాల్గొన్నారు.

గడువులోపు సీఎంఆర్ ఇవ్వాలి

గడువులోపు సీఎంఆర్ ఇవ్వాలని అదనపు కలెక్టర్ లత రైస్‌మిల్లర్లకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఈనెల 30లోపు అప్పగించాలని ఆదేశించారు. ఎఫ్‌సీఐ అధికారులు సీఎంఆర్ గోదాంలలో అవసరమైన స్థలాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

గోదావరిలోకి రొయ్యపిల్లలు


రొయ్యపిల్లలు వదులుతున్న అధికారులు

వెల్గటూర్: సమీకృత మత్స్య అభివృద్ధి పథకంలో భాగంగా వెల్గటూర్ మత్స్యకారులకు ఆరు లక్షల రొయ్య పిల్లలను పంపిణీ చేసినట్లు మత్స్య సహకార సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల సతీశ్ తెలిపారు. ఆ రొయ్య పిల్లలను జిల్లా ఫిషరీస్ అధికారి దామోదర్ ఆధ్వర్యంలో కోటిలింగాల వద్ద గల గోదావరి నదిలో వదిలారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్క మౌనిక, వెల్గటూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షుడు గుమ్ముల మల్లేశ్, కార్యదర్శి బండమీది రమేశ్, గుమ్ముల వెంకటేశ్, రాయనర్సు, చిలుకలయ్య, శంకర్, వెంకటేష్, లక్ష్మణ్, నవీన్, సురేశ్, శ్రీను ఉన్నారు.

వాహనాలు మూలకు

- చెత్త సేకరణలో జాప్యం
- పనిచేయని స్వీపింగ్ మిషన్
- పేరుకుపోతున్న చెత్త
- లోపిస్తున్న పారిశుధ్యం


ఇది జగిత్యాల మున్సిపాలిటీలో మరమ్మతుకు వచ్చిన ట్రాక్టర్. వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిరుపయోగంగా ఉంది. తుప్పుపట్టిపోతోంది. అయినా వాహనాలను వినియోగంలోకి మాత్రం తేవడం లేదు.



ఈ చిత్రంలో కన్పిస్తున్నది రోడ్లు ఊడ్చే స్వీపింగ్ మిషన్. సుమారు రూ.50 లక్షలతో కొనుగోలు చేశారు. అది పనిచేయకపోవడంతో మూలనపెట్టారు. దీంతో రోడ్లపై చెత్త పేరుకుపోతోంది. ఇంత పెద్ద పట్టణానికి ఒక స్వీపింగ్ మిషన్ సరిపోదు. అది కూడా మరమ్మతుకు తరుచూ లోనవుతోంది.

జగిత్యాల: జిల్లాలో అతిపెద్ద మున్సిపాలిటీ జగిత్యాలనే. గ్రేడ్–1 మున్సిపాలిటీ అయిన ఇక్కడ లక్షకు పైగా జనాభా ఉంది. సుమారు 25వేల వరకు ఇళ్లు ఉన్నాయి. బల్దియా వాహనాలు మూలకు పడడంతో చెత్త సేకరణ ఇబ్బందిగా మారింది. ఫలితంగా పారిశుధ్యలోపం ఏర్పడుతోంది. మున్సిపాలిటీలో 48 వార్డులకు ఆటోలు 47 ఉన్నాయి. ప్రతి వార్డుకు ఒక ట్రాక్టర్ వెళ్లి తడి, పొడి చెత్త సేకరించాల్సి ఉంటుంది. కానీ రోజువిడిచిరోజు వెళ్తున్నారు. కొన్నిచోట్లకు వెళ్లడమే లేదన్న ఆరోపణలున్నాయి. వాహనాలకు మరమ్మతు వస్తే ఆ కాలనీలకు రెండుమూడు రోజులపాటు చెత్త సేకరించడం లేదు. ఇటీవల 41, 11 వార్డులకు చెందిన ఆటోలు చెడిపోవడంతో అక్కడ చెత్త సేకరణ ఇబ్బందిగా మారింది.

షాపుల వద్ద అంతంతే..

జిల్లా కేంద్రంలో సుమారు రెండు వేలకు పైగా షాపులుంటాయి. నిత్యం ఒక ట్రాక్టర్, ఒక టిప్పర్ ద్వారా మాత్రమే చెత్త సేకరిస్తున్నారు. నిబంధనల ప్రకారం షాపుల వారు యూజర్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఎవరూ చెల్లించకున్నా మున్సిపాలిటీ ట్రాక్టర్ల ద్వారా చెత్త తీసుకెళ్తున్నారు. అయితే పూర్తిస్థాయిలో తీసుకెళ్లకపోవడంతో షాపుల ముందు పేరుకుపోతోందన్న అపవాదు ఉంది. యూజర్ చార్జీలు వసూలు చేయడంలోనూ బల్దియా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

తడి, పొడి చెత్త ఎక్కడ..?

కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరించాలన్నది లక్ష్యం. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. కానీ వాహనాల కొరతే ఇబ్బందిగా మారింది. 48 వార్డులకు ట్రాక్టర్లు ఉన్నా మరమ్మతుకు వస్తేనే సమస్య ఏర్పడుతోంది. మరిన్ని వాహనాలను కొనుగోలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో ప్రతి ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని చెత్తబుట్టలను సైతం జారీ చేశారు. అది ఎక్కడ అమలు కావడం లేదు. దీంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది.

మరమ్మతుకూ ఇబ్బందులే..

వాహనాల విడి భాగాలు జగిత్యాలలో లభించడం లేదు. ఓ స్వీపింగ్ మిషన్‌కు సంబంధించిన విడిభాగం కోసం వెళ్తే ఎక్కడా దొరకలేదు. అది దాదాపు ఏడాది నుంచి మూలనే ఉంటోంది.

జగిత్యాల బల్దియాలో పరిస్థితి

ఆటోలు	47
ట్రాక్టర్లు	12
జేసీబీ	1
ఫ్రంట్ బ్లేడ్‌ట్రాక్టర్	1
డంపర్ బ్లేసర్	1
బ్యాక్ హోల్‌లోడర్	1
టిప్పర్	1
స్వీపింగ్ మిషన్	1

నిత్యం సేకరించడం లేదు



వార్డుల్లో చెత్త సేకరణ చేయడంలో జాప్యం జరుగుతోంది. రోజు విడిచి రోజు లేదా రెండు రోజులకోసారి వస్తున్నారు. చెత్త పేరుకుపోతోంది. అధికారుల స్పందించి నిత్యం చెత్త సేకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– కల్యాణ్, జగిత్యాల

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం



వాహనాలతో చెత్త సేకరిస్తున్నాం. వాహనాలకు తక్షణమే మరమ్మతు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం తడి, పొడి చెత్త వేరుగానే సేకరిస్తున్నాం. ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నాం.

– అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్

మహిళా బిల్లుపై హర్షం


కేసీఆర్, కేటీఆర్, కవిత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్‌పర్సన్

- ఎమ్మెల్సీ కవిత పోరాట ఫలితమేనన్న బీఆర్‌ఎస్
- మహిళలకు దక్కిన గౌరవమన్న భోగ శ్రావణి

జగిత్యాలటౌన్/జగిత్యాల: మహిళలకు 33శాతం రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడంపై జిల్లావ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఎమ్మెల్సీ కవిత పోరాట ఫలితమేనని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని ధరూర్ క్యాంప్‌లో గల తెలంగాణ భవనంలో సంబరాలు నిర్వహించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మహిళ జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

అపూర్వ గౌరవం

బిల్లు ఆమోదం మహిళలకు దక్కిన గౌరవమని జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. నాయకులు దశరథరెడ్డి, రాజన్న, మాడిశెట్టి మల్లేశం, మహిళామోర్చా నాయకులు, పాల్గొన్నారు.

బిల్లు చరిత్రాత్మకం



మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మకం. బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించేందుకు కృషి చేసిన ఎన్డీయే, ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు ధన్యవాదాలు.

– భోగ శ్రావణి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు

ప్రాతినిధ్యం పెరుగుతుంది



మహిళా రిజర్వేషన్ బిల్లుతో చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది. దేశాభివృద్ధిలో మహిళలు తమదైన ముద్ర వేసే అవకాశం దక్కింది.

– వీటీ.కవిత, ఉపాధ్యాయురాలు, సోషల్ ఆక్టివిస్ట్

అరుదైన గౌరవం



చట్టసభల్లో 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడం మహిళలకు దక్కిన అరుదైన గౌరవం. రిజర్వేషన్‌తో రాజకీయ రంగంలోనూ సత్తా చాటే అవకాశం కలిగింది.

– అయిత అనిత, రచయిత్రి, ఉపాధ్యాయురాలు

శుభ పరిణామం



మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం శుభసూచకం. రిజర్వేషన్ కల్పిస్తూ ఆమోదించడం దేశ చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుంది.

– అనుమల్ల జయశ్రీ, 35వ వార్డు కౌన్సిలర్

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్
- గృహలక్ష్మి ప్రొసీడింగ్స్ పంపిణీ
- పాల్గొన్న ఎమ్మెల్సీ రమణ, జెడ్పీచైర్‌పర్సన్ వసంత


పొసీడింగ్ కాపీలు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్, చిత్రంలో ఎమ్మెల్సీ రమణ, జెడ్పీచైర్‌పర్సన్ వసంత

జగిత్యాలరూరల్: రాష్ట్రంలోని ప్రతిఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. గురువారం తిప్పన్నపేట శివారులోని ఓ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగిత్యాల రూరల్ మండలానికి చెందిన 640 మంది, అర్బన్ మండలానికి చెందిన 123 మందికి గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలు, 59 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నారని, ప్రతి పథకం అర్హులందరికీ అందేలా చూస్తున్నారని పేర్కొన్నారు. జగిత్యాలకు మెడికల్ కళాశాల రావడం గర్వకారణమన్నారు. గతంలో విద్యుత్ కోతలతో రైతులు, ప్రజలు ఇబ్బంది పడేవారని, ఇప్పుడు 24గంటల విద్యుత్‌తో హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించేందుకు మంత్రి కేటీఆర్ ఐటీ కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చారని తెలిపారు. ముందుగా కొండాలక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, జెడ్పీటీసీ మహేశ్, ఇన్‌చార్జి ఎంపీపీ ములాసపు లక్ష్మి, సింగిల్ విండో చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, రైతుబంధు కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, ఎంపీడీవోలు రాజేశ్వరి, శైలజరాణి, ఎంపీవోలు రవిబాబు, సలీం, ఆర్‌ఐ పాల్గొన్నారు.

దళితబంధు ఎమ్మెల్యే బంధుగా మారింది

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన దళిత బంధు పథకం ఎమ్మెల్యేల బంధుగా మారిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. గురువారం జగిత్యాలలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తులు స్వీకరించకుండా దళిత బంధు లబ్ధిదారులను ఎలా ఎంపిక చేస్తున్నారని ప్రశ్నించారు. అర్హుల ఎంపికలో కలెక్టర్, ప్రజాప్రతినిధులు భాగస్వాములుగా ఉంటారని ప్రభుత్వం విడుదల చేసిన జీవో8లో పేర్కొన్నారని, ఆ ప్రజాప్రతినిధులెవరో చెప్పాలని ప్రశ్నించారు. ఎమ్మెల్యేనా..? ఎమ్మెల్సీనా..? ఎంపీనా..? సర్పంచా..? ఎవరో కలెక్టర్ స్పష్టం చేయాలన్నారు. దరఖాస్తులు ఎక్కడ స్వీకరిస్తారు..? అర్హుల ఎంపిక ప్రక్రియ వంటి అంశాలపై కలెక్టర్ ప్రకటన విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న అన్ని సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రజాప్రతినిధుల జోక్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలవుతున్నది అంబేద్కర్ రాజ్యాంగమో..? బీఆర్‌ఎస్ రాజ్యాంగమో అర్థం కావడం లేదన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు ప్రజల హక్కు పత్రమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన గ్యారెంటీ పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, గాజంగి నందయ్య, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, జున్ను రాజేందర్, ధర రమేశ్, మన్సూర్, మహేందర్‌గౌడ్, రాధాకిషన్, గుండ మధు తదితరులు పాల్గొన్నారు.

నిలువెల్లా నిర్లక్ష్యం

- భూ రికార్డులకు భద్రత కరువు
- పెండింగ్‌లో వేలాది దరఖాస్తులు
- సర్వేయర్లు, సిబ్బంది కొరత కారణం
- తీవ్ర ఇబ్బందుల్లో అర్జీదారులు

జిల్లా సమాచారం

మండలాలు	20
గ్రామాలు	380
భూవిస్తీర్ణం(ఎకరాల్లో)	7,05,922
ఉండాల్సిన టిపన్‌లు	1,57,602
మాయమైనవి	60,602
అందుబాటులో ఉన్నవి	97,000
రెగ్యులర్ సర్వేయర్లు	7
లైసెన్స్‌డ్ సర్వేయర్లు	7
డీఐలు	2(ఒకటి ఖాళీ)
భూ సమస్యలపై దరఖాస్తులు	431


కలెక్టరేట్‌లోని ఓ గదిలో పడేసిన భూరికార్డులు

జగిత్యాల: జిల్లాలోని భూ రికార్డులకు భద్రత కరువైంది. కరీంనగర్ నుంచి ఇటీవలే వీటిని తెప్పించారు. అయితే వాటిని భద్రంగా నిల్వచేయాల్సిన అధికారులు.. కలెక్టరేట్‌లోని ఓ మూలన.. అది కూడా నేలపైనే పడేశారు. కనీసం ర్యాక్‌లపై కూడా సర్దలేదు. ఒకవైపు గ్రామాల్లో హద్దుల నిర్ణయం, భూ సమస్యలపై రైతుల మధ్య ఇప్పటికే చాలా గొడవలు జరుగుతున్నాయి. వీటిపై అధికారులకూ వేల సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయి. బాధితులకు అవసరమైన సమాచారం అంతా ఈ రికార్డుల్లోనే ఉంది. ఇలాంటి వాటికి భద్రత కల్పించాల్సింది పోయి ఓ గదిలో నేలపై పడేయడం విమర్శలకు తావిస్తోంది.

నెలలు గడుస్తున్నా..

- తమ భూములకు హద్దులు నిర్ణయించాలంటూ జిల్లావ్యాప్తంగా 431 మంది రైతులు అధికారులకు ఇప్పటికే దరఖాస్తు చేశారు.
- వాటిని పరిష్కరించాల్సిన అధికారులు నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు.
- అర్జీలను పరిష్కరించిన దాఖలాలు లేవు.
- సరైన రికార్డులు లేక, కొన్ని గ్రామాల్లో టీపన్లు లేక సమస్య ఎదురవుతోంది.
- సిబ్బంది కొరత, ఇతరత్రా సర్వేకు సర్వేయర్లు వెళ్తుండడంతో కూడా ఇబ్బంది ఎదురవుతోంది.
- భూ సర్వేకు దరఖాస్తు చేసుకున్న వారి సహనానికి పరీక్ష. గ్రామీణ ప్రాంతాల్లో భూహద్దుల కోసం అనేక గొడవలు జరుగుతున్నాయి.

45రోజుల్లో సర్వే చేయాలి..

భూసమస్యలపై తొలుత మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేయాలి. వాటి ఆధారంగా అధికారులు గ్రామాల టిపన్లు, రికార్డుల సాయంతో 45 రోజుల్లోగా సర్వే చేసి హద్దులు నిర్ణయించాలి. దాని మ్యాప్ తయారు చేయాలి. జిల్లాలో భూ కొలతల కోసం చాలామంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ ఏడాది 431 మంది దరఖాస్తులు చేసుకోగా ఇప్పటి వరకు అవన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో దరఖాస్తుదారులు నిత్యం ఆర్డీవో, భూ కొలతల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

సిబ్బంది కొరత

జిల్లాలో 20 మండలాల ఉన్నాయి. ఏడుగురు రెగ్యులర్, మరో ఏడుగురు లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఉన్నారు. ఆరు ఖాళీగా ఉన్నాయి. దీంతో కొన్ని మండలాలకు ఇన్‌చార్జీలను నియమించారు. సిబ్బంది కొరతతో భూ సర్వేలు, హద్దుల నిర్ణయంలో జాప్యమవుతోంది. ఇవి యజమానుల మధ్య ఘర్షణలు తీవ్రమయ్యేందుకు కారణమవుతున్నాయి.

సమస్యలు పరిష్కరిస్తాం



జిల్లాలో రెండు మండలాలకు ఒక సర్వేయర్‌ను కేటాయించాం. సిబ్బంది కొరతతోపాటు సుమారు 60వేల వరకు టిపన్‌లు లేక సమస్యలు వస్తున్నాయి. ఇటీవల కరీంనగర్ నుంచి రికార్డులు తెప్పించాం. వాటిని పరిశీలిస్తాం. బడ్జెట్ లేక ప్రస్తుతం ఒక గదిలో వాటిని భద్రపర్చాం. ర్యాక్‌లు కొనుగోలు చేసి వాటిలో అమర్చుతాం. భూ సంబంధిత సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం.

– వెంకట్‌రెడ్డి, ఏడీ, భూ కొలతల శాఖ

టిపన్లు మాయం?

సర్వే నంబరులోని కొలత రికార్డులను టిపన్ అంటారు. భూముల కొలతలతో పాటు హద్దుల వివరాలు తెలిపేలా రికార్డుల ఆధారంగా గ్రామపటం తయారుచేస్తారు. దీనినే టిపన్(నక్ష)గా పిలుస్తారు. భూ సర్వేకు నక్ష ఉండాలి. ఇలాంటి వి మాయం కావడం ఆందోళనకు గురిచేస్తోంది.

సర్వేనంబర్ ప్రకారమే కొలతలు..

గ్రామాల్లోని ఒక సర్వే నంబరులో 50–100 ఎకరాల వరకు ఉంటుంది. ఇందులో ఒకరికి 2, మరొకరికి 5, ఇంకొకరికి 10 ఎకరాల వరకు ఉండేవీలుంది. ఈక్రమంలో హద్దుల నిర్ణయంలో వివాదం తలెత్తుతోంది. టిపన్లు ఉంటే సర్వే నంబర్లలోని సంపూర్ణ భూమి కొలిచి హద్దులు నిర్ణయిస్తారు. కానీ ఇక్కడ టిపన్లు లేక సర్వే, హద్దుల నిర్ణయంలో జాప్యం జరుగుతోంది. వీటిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

మహిళల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం


బీఆర్‌ఎస్‌లో చేరుతున్న తాట్లవాయికి చెందిన మహిళలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- బీఆర్‌ఎస్‌లో చేరిన మహిళలు

రాయికల్: మహిళల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని తాట్లవాయికి చెందిన మహిళలు ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి ఆధ్వర్యంలో గురువారం బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మహిళల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చొరవతో మహిళలకు 33 శాతం బిల్లుకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు. సర్పంచ్ రాగి సాగరిక, ఉపసర్పంచ్ మల్లేశం, నాయకులు రంజిత్, లత, మహిపాల్, గంగాధర్, రాంచందర్‌రావు, మోహన్‌రెడ్డి, సురేశ్, రాకేశ్, రాజు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకులు

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని పదోవార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ మహిళలను బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికం ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. జిల్లా కేంద్రంలో ఎకరం స్థలం కేటాయించాలని స్వర్ణకార సంఘం నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. త్వరలోనే మంజూరుకు కృషిచేస్తానన్నారు. శాలీవాహన సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, చిరంజీవి, ప్రవీణ్, దామోదర్, గణేశ్, రాజేందర్, అజయ్, రాజయ్య, కిషన్, మారుతి, లక్ష్మణ్, టీవీ.సూర్యం పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు

జగిత్యాలరూరల్: పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్‌దేనని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడలో ఒడ్డెర, మైనార్టీ, విశ్వబ్రాహ్మణ, ఎస్సీ, రజక సంఘం, యూత్ సభ్యులు సుమారు 200 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా నిలుస్తోందన్నారు. దావ సురేశ్, సింగిల్ విండో చైర్మన్ సందీప్‌రావు, సర్పంచ్ మహేశ్వర్‌రావు, ఎంపీటీసీ పర్శురాంగౌడ్, నాయకులు తిరుపతిరెడ్డి, హరికిషన్‌రావు, రాజన్న, అంజి, రాజు, శ్రీనివాస్, రాజేశం పాల్గొన్నారు.

క్లుప్తంగా

గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని వేంపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద గల్ఫ్ జేఏసీ నాయకులు గురువారం నిరసన తెలిపారు. గల్ఫ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారి కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని, గల్ఫ్‌లో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలని, వారి పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రవి, నాయకులు ధర్మేందర్, సురేందర్, శ్రీనివాస్, రాజు, రవి, గణేశ్, నరేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ లాయర్స్ కాన్ఫరెన్స్‌కు శ్రీపాల్‌రెడ్డి



జగిత్యాలజోన్: ఇంటర్నేషనల్ లాయర్స్ కాన్ఫరెన్స్ ఈ నెల 23, 24 తేదీల్లో ఢిల్లీలో జరగనుంది. ఇందులో జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపల్లి శ్రీపాల్‌రెడ్డి పాల్గొనున్నారు. రాష్ట్రంలోని బార్ అసోసియేషన్ల అధ్యక్షులు సైతం హాజరు కానున్నారు. ఈ కాన్ఫరెన్స్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఇందులో అంతర్జాతీయ సంబంధాలు, న్యాయ సంబంధిత, భౌగోళిక, పౌరులందరికీ సమన్యాయం తదితర అంశాలపై చర్చించనున్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ఇబ్రహీంపట్నం: మండలంలోని కోమటికొండాపూర్ గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. కోమటి కొండాపూర్ నుంచి నిర్మల్ జిల్లా వైపు ఇసుక రవాణా చేస్తున్నట్లు పేర్కొన్నారు. టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశామన్నారు.

ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

జగిత్యాల: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను ఎస్సీ బాలబాలికలకు 5 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా సమన్వయాధికారి వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వీటీజీ సెట్–2023, బీఎల్వీ సెట్–2023 రాసి, సీటు వచ్చి జాయిన్ కాలేని వారికి ఎస్సీ ఆర్ఫన్, సెమీ ఆర్ఫన్ దివ్యాంగులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. విద్యార్థులు సీటు వచ్చిన కాపీ, హాల్ టికెట్, ఆధార్‌కార్డు తీసుకొని, ఈ నెల 23న చింతకుంట గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



సారంగాపూర్: గ్రామాల్లో క్లోరినేషన్, పారిశుధ్యం బాగుంటేనే వ్యాధులు అదుపులోకి వస్తాయని జిల్లా ప్రోగ్రాం అధికారి (మాతాశిశు సంరక్షణ) జయపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెంబట్ల, అర్పపల్లిలో వైద్య శిబిరాలు నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి రక్తనమూనాలను సేకరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మంచినీటి బావుల్లో క్లోరినేషన్ చేయాలని, మురికి కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఆయిల్ బాల్స్ వేయించాలని సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. వారానికో రోజు డ్రైడే పాటించాలని పేర్కొన్నారు. సర్పంచ్‌లు బొడ్డుపల్లి రాజన్న, కొండ శ్రీలత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ఆదాయం మున్సిపాలిటీలకే

- ప్రత్యేక ఖాతా తెరిచిన అధికారులు
- జిల్లాలో 25,908 దరఖాస్తులు



ప్లాట్లు ఏర్పాటు చేసిన స్థలం

బుగ్గారం: అనధికార లే అవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం 2020 ఆగస్టు నుంచి దరఖాస్తులు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జగిత్యాల జిల్లాలోని అనేక ప్రాంతాల్లో, మున్సిపాలిటీల్లో ప్లాట్లు కొనుగోలు చేసినవారి నుంచి ఎల్ఆర్ఎస్‌కు భారీగా దరఖాస్తులు వచ్చాయి. రూ.1,000 నుంచి రూ.10 వేలు చెల్లించి అర్జీ పెట్టుకున్నారు.

కొనసాగుతున్న పరిశీలన ప్రక్రియ

ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. దీని ద్వారా వచ్చే ఆదాయం పూర్తిగా మున్సిపాలిటీలకే వెళ్లనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఖాతా ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు గానూ కోరుట్లలో 9,090, జగిత్యాలలో 8,011, మెట్‌పల్లిలో 5,871, రాయికల్‌లో 1,896, ధర్మపురిలో 1,040 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఎక్కువగా వ్యక్తిగత ప్లాట్లు ఉండగా, మిగతావి లే అవుట్ల క్రమబద్ధీకరణవి. వీటికి మార్కెట్ విలువను అనుసరించి చార్జీలు వసూలు చేస్తున్నారు. 100 చదరపు మీటర్లలోపు ప్లాట్లకు చ.మీ.కు రూ.200, 100 నుంచి 300 చ.మీ.లోపు వాటికి చ.మీ.కు రూ.400, 300 నుంచి 500 చ.మీ.లోపు వాటికి రూ.600, ప్లాట్ స్థలం 500 చదరపు మీటర్లకు పైగా ఉంటే చ.మీ.కు రూ.750 చొప్పున తీసుకుంటున్నారు. ఈ ఆదాయాన్ని ఎల్ఆర్ఎస్ ప్రత్యేక ఖాతాలో జమ చేస్తున్నారు.

చార్జీలు భారమంటున్న దరఖాస్తుదారులు

అనధికార లే అవుట్లలో, చిన్న చిన్న వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఎల్ఆర్ఎస్ చార్జీలు భారంగా మారాయని పలువురు అంటున్నారు. ఒక గుంట లేదా గుంటన్నర స్థలానికే కనీసం రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతోందని వాపోతున్నారు. ప్లాట్లు కొన్న వారి వద్ద నుంచి ఇంటి నిర్మాణ సమయంలో వసూలు చేసే చార్జీలను అమ్ముకునే వారి వద్ద నుంచే వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. దీంతో అవసరానికి స్థలాలు అమ్ముకునే వారికి అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చార్జీల భారం తగ్గించాలి



నేను రెండేళ్ల క్రితం ఎల్ఆర్ఎస్ కోసం రూ.20 వేలకు పైగా చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకున్నాను. ప్రస్తుతం దరఖాస్తులు పరిశీలిస్తున్న నేపథ్యంలో ఇందుకయ్యే చార్జీలు భారంగా మారాయి. వెంటనే తగ్గించాలి.

– వావిలాల తిరుపతి, ధర్మపురి

దరఖాస్తులు పరిశీలిస్తున్నాం



ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలిస్తున్నాం. నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటిని ఆమోదిస్తూ మార్కెట్ విలువ మేరకు ఫీజులు తీసుకుంటున్నాం. దీనివల్ల మున్సిపాలిటీ ఆదాయం పెరగనుంది.

– సీహెచ్.రమేశ్, మున్సిపల్ కమిషనర్, ధర్మపురి

సెల్‌ఫోన్లు చోరీ చేసి.. డబ్బులు మాయం చేసి

- అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు
- 85 సెల్‌ఫోన్లు, కిలోన్నర గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్, సీసీఎస్ ఏసీపీ మాధవి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీలు నరేందర్, మాధవి

కరీంనగర్‌క్రైం: సెల్‌ఫోన్లు చోరీచేస్తూ.. అందులోని బ్యాంకు ఖాతాల్లో డబ్బులు మాయం చేస్తున్న ముఠాను కరీంనగర్ వన్‌టౌన్, సీసీఎస్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కరీంనగర్ వన్‌టౌన్‌లో నిందితుల వివరాలను టౌన్ ఏసీపీ జి.నరేందర్, సీసీఎస్ ఏసీపీ మాధవి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన బేతంపల్లి ఎల్లప్ప, వికారాబాద్ జిల్లా చౌదాపూర్ మండలం తండాకు చెందిన వడ్డె శ్రీనివాస్, హైదరాబాద్ బోడుప్పల్‌కు చెందిన మాతాజీ శివ, హైదరాబాద్‌కు చెందిన బోయ మురళీ, చిన్నా, బేతంపల్లి భూలక్ష్మి హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ముఠాగా ఏర్పడ్డారు. వివిధ జిల్లాలు తిరుగుతూ రద్దీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు దొంగలించడం ప్రారంభించారు. ఈ నెల 17న కరీంనగర్ కూరగాయల మార్కెట్లో వినోద్‌రెడ్డి అనేవ్యక్తి సెల్‌ఫోన్ దొంగలించారు. అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.2.10లక్షలు మాయం కావడంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన వన్‌టౌన్, సీసీఎస్ పోలీసులు నిందితుల కోసం గాలించారు. నిందితులైన ఎల్లప్ప, వడ్డె శ్రీనివాస్, శివ, మురళీ సికింద్రాబాద్‌లో గంజాయి కొనుగోలు చేసి కారులో కరీంనగర్ వస్తున్నారన్న సమాచారంతో వాహనాల తనిఖీ చేపట్టారు. నిందితులు పట్టుబడి పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్, జగిత్యాల, కామారెడ్డి, దుబ్బాకతో పాటు పలు ప్రాంతాల్లో 85 సెల్‌ఫోన్లు దొంగలించామని ఒప్పుకున్నారు.

సెల్‌ఫోన్ల ద్వారా నగదు మాయం

సెల్‌ఫోన్లు చోరీ చేసి వివిధ రకాల పాస్‌వర్డ్‌లతో ఫోన్‌పే, గూగుల్ పే ఓపెన్ చేసి బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు దొంగలించే ప్రయత్నం చేశారు. రెండు సెల్‌ఫోన్లలో పాస్‌వర్డ్‌లు సులభంగా ఉండడంతో కరీంనగర్‌లో దొంగలించిన సెల్‌ఫోన్‌లోని ఫోన్‌పే నుంచి రూ.2.10లక్షలు, దుబ్బాకలో ఓ సెల్‌ఫోన్ నుంచి రూ.లక్ష కాజేశారు. నిందితుల నుంచి 85సెల్‌ఫోన్లు, కిలోన్నర గంజాయి, రూ.45వేల నగదు, గొడ్డలి స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని రిమాండ్ చేశామని, చిన్నా, బేతంపల్లి భూలక్ష్మి పరారీలో ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో సీఐలు రవికుమార్, లింగమూర్తి, పుల్లయ్య, ఎస్సైలు స్వామి, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.



పట్టుబడిన సెల్‌ఫోన్లు, నగదు, గొడ్డలి

జూనియర్ సివిల్ జడ్జిల నియామకం

కరీంనగర్‌క్రైం: ఇటీవల నూతనంగా నియామకమైన 39 మంది జూనియర్ సివిల్ జడ్జిలను రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న కోర్టుల్లో నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నియామకాల్లో భాగంగా ఉమ్మడి జిల్లాల్లోని 9 కోర్టులకు వీరిని కేటాయించింది. నంది మేడారం జూనియర్ సివిల్ జడ్జిగా నల్లాల వెంకట సచిన్‌రెడ్డి, హుజురాబాద్ ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా పద్మశ్రీ, కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జిగా కాసుల్ల పావని, రాజన్న సిరిసిల్ల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా కావేటి సజన, కరీంనగర్ స్పెషల్ ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్‌గా బానోత్ రాజేశ్వర్, కరీంనగర్ ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా దామెర్ల ప్రీతిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హుజురాబాద్ ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న పాలడుగు అలేఖ్యను అక్కడే ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. సిరిసిల్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు ముదావత్‌ను రంగారెడ్డి మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ చేయగా, ఈస్థానంలో నాగర్ కర్నూల్ ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ అరవను నియమించారు. వీరంతా అక్టోబర్ 4వ తేదీలోపు జాయిన్ కావాలని ఉత్తర్వుల్లో సూచించారు.

సర్పంచ్ భర్త, అతని అనుచరుడిపై ఫిర్యాదు



గాయపడిన గంగారెడ్డి

ధర్మపురి(బుగ్గారం): బుగ్గారం మండల కేంద్రంలో సర్పంచ్ భర్త మూల శ్రీనివాస్ అనుచరుడు కత్తితో దాడి చేశాడంటూ చుక్క గంగారెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని వివరాల ప్రకారం.. బుగ్గారానికి చెందిన ఉద్యమకారుడైన గంగారెడ్డి గ్రామ పంచాయతీలో రూ.లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీన్ని మనసులో పెట్టుకున్న సర్పంచ్ భర్త బుధవారం సాయంత్రం అతని అనుచరుడు గంగరాజంతో దాడి చేయించగా నుదిటిపై, చెంపపై, చాతిలో స్వల్ప గాయాలయ్యాయి. 2022 మే 1న కూడా ఇలాగే దాడి చేయించాడు. హత్యాయత్నం చేసిన గంగరాజం, ఇందుకు కారణమైన సర్పంచ్ భర్తపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు.

కలప పట్టివేత



కలపతో ఎఫ్ఆర్వో భూమేశ్, సిబ్బంది

రాయికల్: కొత్తపేట గ్రామంలో గురువారం అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్ల కలపను పట్టుకున్నట్లు రాయికల్ ఎఫ్ఆర్వో భూమేశ్ తెలిపారు. జగిత్యాలలోని కల్లెడ టింబర్ డిపోకు తరలించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ రేంజ్ అధికారి చంద్రమౌళి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు విజయ్‌కుమార్, మల్లయ్య, నరేశ్, బీట్ అధికారులు రమణారెడ్డి, నరేశ్, వసీం, క్రాంతికుమార్, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

అత్తింటివారిపై వరకట్న వేధింపుల కేసు

జగిత్యాల క్రైం: అదనపు కట్నం కోసం ఓ వివాహితను వేధిస్తున్న ఆమె అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మోతె గ్రామానికి చెందిన శిరీషకు ఖానాపూర్‌కు చెందిన బోకిని గణేశ్‌తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. కొంత కాలంగా భర్త గణేశ్, అత్త కనకవ్వ, చిన్నత్త లక్ష్మిలు అదనపు కట్నం తీసుకురావాలని ఆమెను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు గురువారం జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దూరదర్శన్ ఆడిషన్స్‌లో ఎంపిక



నరేశ్

జగిత్యాల: దూరదర్శన్ కేంద్రం ప్రసారభారతి హైదరాబాద్ వారు గత నెలలో శాస్త్రీయ నృత్య విభాగంలో ఆడిషన్స్ నిర్వహించగా జగిత్యాలవాసి బొమ్మడి నరేశ్ ఎంపికయ్యారు. కూచిపూడి నాట్యంలో అత్యంత ప్రతిభ కనబర్చినందున ఆడిషన్స్ కమిటీవారు కళాకారుడిగా గుర్తించి, బీ గ్రేడ్ ప్రశంసాపత్రం అందించినట్లు నరేశ్ గురువారం తెలిపారు.



చెత్త, పిచ్చిమొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని పలు కాలనీల్లో మురికినీరు నిలిచి దోమలు దండయాత్ర చేస్తున్నాయి. దీంతో 'సాక్షి' 'దోమల దాడి'శీర్షికన గురువారం కథనం ప్రచురించింది. స్పందించిన మున్సిపల్ సిబ్బంది గణేశ్‌నగర్‌కాలనీ, నర్సింగాపూర్‌కు వెళ్లేదారి, జాంబాగ్ ప్రాంతంలో నిలిచిన మురికినీటిలో ఆయిల్‌బాల్స్ వేశారు.

పింఛన్ల పంపిణీలో కోరుట్లదే అగ్రస్థానం

- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు
- పింఛన్ లబ్ధిదారులకు కార్డులు పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు

కోరుట్ల రూరల్: పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలోనే కోరుట్ల నియోజకవర్గం అగ్రస్థానంలో ఉందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. మండలంలోని అయిలాపూర్, పైడిమడుగు గ్రామాల్లో అయిలాపూర్, యూసుఫ్‌నగర్, కల్లూర్, సర్పరాజ్‌పూర్, ధర్మారం, జోగిన్‌పెల్లి, తిమ్మయపల్లె గ్రామాల పింఛన్ లబ్ధిదారులకు కార్డులు అందించారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ఏదోరకంగా పథకం దరి చేరిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. ఈసారి తన కుమారుడిని ఆశీర్వదించాలని కోరారు. ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ కిషన్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్, రైతుబంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు, ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, వైస్ ఎంపీపీ చీటి స్వరూపారాణి, సర్పంచుల ఫోరం గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

టెంట్ కూలి అంగన్‌వాడీలకు గాయాలు



డ్రైనేజీలో పడిపోయిన టీచర్ రాణి



పరామర్శిస్తున్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: టెంట్ కూలడంతో పలువురు అంగన్‌వాడీ టీచర్లు గాయపడ్డారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 11 రోజులుగా వారు ధర్మపురి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం భారీ వర్షం కురిసి, టెంట్ తడిసి ముద్దయింది. ఒక్కసారిగా కూలిపోవడంలో టీచర్లు, హెల్పర్లు పరుగులు తీశారు. అందులో ఇరుక్కుపోయిన ధర్మపురికి చెందిన బేర మరియ, తిమ్మాపూర్‌కు చెందిన కస్తూరి రాణి పక్కనే ఉన్న డ్రైనేజీలో పడిపోయారు. ఈ ఘటనలో రాణి చేయి విరిగింది. మరియ తలకు టెంట్ కర్ర తగలడంతో తీవ్ర గాయమైంది. ఇద్దరిని చికిత్స నిమిత్తం మొదట స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మిగిలిన అంగన్‌వాడీలు యథావిధిగా సమ్మె కొనసాగించారు.


అంగన్‌వాడీలకు అండగా ఉంటాం

సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న అంగన్‌వాడీలకు అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురిలో అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మెకు మద్దతు తెలిపారు. టెంట్ కూలి ఇద్దరు అంగన్‌వాడీలు గాయపడగా పరామర్శించారు. అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా కలెక్టర్, మంత్రి కొప్పుల ఈశ్వర్ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో శేఖర్, గంగాధర్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

పెగడపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవాలని లక్ష్మణ్‌కుమార్ కార్యకర్తలకు సూచించారు. పెగడపల్లి మండలం రాజరాంపల్లిలో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. ఈనెల 23న రాజరాంపల్లి, ఎల్లాపూర్, రామభద్రునిపల్లి, కీచులాటపల్లిలో చేపట్టనున్న గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, మల్లారెడ్డి, శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, సత్యం, భాస్కర్, ప్రవీన్, సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని టవరెక్కిన భర్త



టవర్‌పై ప్రభాకర్

వెల్గటూర్: భార్య కాపురానికి రావడం లేదని ఓ భర్త విద్యుత్ టవర్ ఎక్కిన సంఘటన ఎండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పడకల్‌కు చెందిన మేకల ప్రభాకర్–లావణ్య దంపతులు. భర్త మద్యానికి బానిసై, నిత్యం వేధించడంతో తట్టుకోలేక లావణ్య కొన్ని రోజుల క్రితం తన ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగినా ప్రభాకర్ తీరు మారకపోవడంతో ఆమె పుట్టింట్లోనే ఉంటోంది. దీంతో మనస్తాపానికి గురైన ప్రభాకర్ తన భార్య కాపురానికి రాకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ గురువారం విద్యుత్ టవరెక్కాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సర్దిచెప్పి, అతన్ని కిందికి రప్పించారు. తర్వాత దంపతులకు కౌన్సెలింగ్ చేయడంతో గొడవ సద్దుమణిగింది.

బైక్‌లో నుంచి రూ.2.30 లక్షలు చోరీ

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్‌లో ఓ ప్రైవేటు బ్యాంకు ఎదుట నిలిపివున్న బైక్‌లో నుంచి గుర్తు తెలియని వ్యక్తి రూ.2.30 లక్షలు ఎత్తుకెళ్లాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లికి చెందిన రాజేశ్ రూ.2.30 లక్షలు డిపాజిట్ చేసేందుకు గురువారం మధ్యాహ్నం ప్రైవేటు బ్యాంకుకు బైక్‌పై వెళ్లాడు. వాహనం బ్యాంకు ఎదుట నిలిపి, టీ తాగి వచ్చేసరికి దుండగుడు బైక్ బ్యాగులో ఉంచిన డబ్బులను చోరీ చేశాడు. బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై అబ్దుల్‌రహీం సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ పరిశీలించి, ఆరు రోజుల క్రితం ఇదే ప్రాంతంలో ద్విచక్ర వాహనం నుంచి డబ్బులు ఎత్తుకెళ్లిన వ్యక్తిగా గుర్తించారు. దొంగ కోసం వెతుకుతున్నట్లు పేర్కొన్నారు.

ఎస్జీఎఫ్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

మల్లాపూర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లా స్థాయి క్రీడా పోటీలకు మల్లాపూర్ మండలంలోని సాతారం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు రమేశ్ తెలిపారు. గురువారం స్కూల్లోనే వారిని సత్కరించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందన్నారు. అండర్–17 (బాలికల విభాగం) కబడ్డీలో మైత్రి, ఖోఖోలో రవీనా, అఖిల, వాలీబాల్‌లో జాగృతి, స్పందన, 100 మీటర్ల రన్నింగ్‌లో రవీనా, బాలుర విభాగం కబడ్డీలో శ్రీకాంత్, విష్ణుతేజ, ఖోఖోలో రిషిక్‌రెడ్డి, శ్రీకాంత్, హర్ష, వాలీబాల్‌లో యజ్ఞేశ్వర్, షాట్‌పుట్‌లో యజ్ఞేశ్వర్, లాంగ్‌జంప్‌లో శ్రీకాంత్, విష్ణుతేజ, అండర్–14(బాలికల విభాగం) కబడ్డీలో సంజన, శిరీష, ఖోఖోలో సంజన, అక్షిత, శిరీష, 100 మీటర్ల రన్నింగ్‌లో శిరీష, లాంగ్‌జంప్‌లో శిరీష, బాలుర విభాగం కబడ్డీలో అఖిల్, సారథి, ఖోఖోలో అఖిల్, నవనీత్, వాలీబాల్‌లో సాయిచరణ్ ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమలత, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, పీఈటీ రాజేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన పాలకులు



రైతు దినోత్సవంలో నాయకులు, రైతులు

- భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కాసారపు భూమారెడ్డి

మల్లాపూర్: రైతే దేశానికే వెన్నెముక అని భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కాసారపు భూమారెడ్డి అన్నారు. బలరామ జయంతిని పురస్కరించుకొని గురువారం మల్లాపూర్ మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద రైతు దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పాలకులు వ్యవసాయాన్ని, రైతులను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. రైతును రాజు చేయడమే లక్ష్యమని ప్రకటిస్తున్నా.. ఆచరణలో మాత్రం పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర చెల్లించలేని దుస్థితి నెలకొందన్నారు. రైతులకు కావాల్సింది ఉచిత పథకాలు కాదని, పంటలకు సరైన గిట్టుబాటు ధర, నష్టం వాటిల్లితే మెరుగైన పరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు కల్లెం మహిపాల్‌రెడ్డి, చెరుకు విభాగం జిల్లా ప్రముఖ్ న్యావనంది లింబారెడ్డి, కిసాన్ సంఘ్ సభ్యులు చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, మహేశ్, గంగరాజం, భూమేశ్వర్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.